

PRGI - TGTEL/25/A0348

జాతీయ తెలుగు దినపత్రిక

Published by
తెలంగాణ - ఆంధ్ర ప్రదేశ్

సందేశం టైమ్స్

నిజం దాగదు - వార్త ఆగదు

జర్నలిస్ట్ శక్తి ప్రజల పక్షం
జర్నలిస్ట్ సంక్షేమం లక్ష్యం
TJWA
Regd. No: 288/2026
తెలుగు జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్
తెలుగు జర్నలిస్టుల సంక్షేమ సంఘం
జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ – సంక్షేమమే మా ధ్యేయం

మంగళవారం 03 నవంబర్ 2026 | పేజీలు : 08 | వెల : 2/- | సంపుటి: 02 . సంచిక : 153 | ప్రచురణ : సూర్యాపేట | ఎడిటర్ : శెట్టి వెంకటేష్



ఒడిశా తీరంలో అరుదైన ఆలివ్ రిడ్లే తాబేళ్ల రక్షణకు ప్రత్యేక చర్యలు.. ఏడు నెలల పాటు సముద్రంలో చేపల వేటపై నిషేధం



భువనేశ్వర్, నవంబర్ 2 (సందేశం టైమ్స్): అరుదైన ఆలివ్ రిడ్లే సముద్ర తాబేళ్ల సంతానోత్పత్తి, గుడ్లు పెట్టే కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఒడిశా ప్రభుత్వం సముద్ర తీర ప్రాంతాల్లో కఠిన ఆంక్షలు అమల్లోకి తీసుకొచ్చింది. ఈ ఏడాది నవంబర్ 1 నుంచి 2027 మే 31 వరకు ఏడు నెలల పాటు గుర్తించిన తాబేళ్ల సంచార, సంతానోత్పత్తి ప్రాంతాల్లో సముద్రంలో చేపల వేట, యాంత్రిక పడవలు, ట్రాలర్ల నిర్వహణపై నిషేధం విధించింది. ధామ్రా, దేవి, రుషికుల్యా నదుల సముద్ర ముఖద్వారాల పరిసరాల్లో తీరానికి 20 కిలోమీటర్ల పరిధి వరకు ఈ ఆంక్షలు అమలు చేయనున్నారు. ధామ్రా నుంచి దేవి నది ముఖద్వారం వరకు సుమారు 160 కిలోమీటర్ల తీర ప్రాంతం తాబేళ్ల సంరక్షణలో కీలకంగా ఉండగా, ప్రపంచంలోనే ప్రసిద్ధి చెందిన గహిర్మాత మెరైన్ శాంక్చువరీలో ఏడాది పొడవునా చేపల వేటపై నిషేధం కొనసాగుతోంది. ప్రతి సంవత్సరం లక్షలాది ఆలివ్ రిడ్లే తాబేళ్లు ఒడిశా తీరానికి చేరుకుని సముద్ర జలాల్లో జతకట్టడంతో పాటు ఇసుక తీరాల్లో గుడ్లు పెడతాయి. ఈ సమయంలో చేపల వేటకు ఉపయోగించే భారీ ట్రాలర్ల వలల్లో తాబేళ్లు చిక్కుకోవడం, పడవల ప్రొపెల్లర్లకు తగిలి ప్రాణాలు కోల్పోవడం వంటి ప్రమాదాలను నివారించడమే ఈ ఆంక్షల ప్రధాన ఉద్దేశం. తాబేళ్ల సంరక్షణ కోసం అటవీ శాఖ ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టింది. గహిర్మాత ప్రాంతంలో మాదలి, శాసనిపడ, ఏకకుల, బాబుబాలి తదితర ప్రాంతాల్లో ప్రత్యేక తాబేళ్ల రక్షణ శిబిరాలను ఏర్పాటు చేయడంతో పాటు అటవీ శాఖ సిబ్బంది, సముద్ర పోలీసుల సహకారంతో నిరంతర నిఘా కొనసాగిస్తున్నారు. గస్తీ పడవల ద్వారా సముద్రంలో పెట్రోలింగ్ నిర్వహిస్తూ అక్రమంగా చేపల వేటకు పాల్పడే పడవలను అడ్డుకునేందుకు చర్యలు చేపట్టారు. బాబుబాలి, శాసనిపడ వంటి సున్నితమైన ప్రాంతాల్లో సాయుధ పోలీసుల సహాయంతో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. అదేవిధంగా భద్రక్, రాజ్‌నగర్, పూరీ, బ్రహ్మపూర్ వన్యప్రాణి విభాగాల పరిధిలో 61 తీర ప్రాంత శిబిరాలు, ఐదు సముద్ర ప్రాంత శిబిరాల ద్వారా సంరక్షణ చర్యలు చేపడుతున్నారు. నిబంధనలు ఉల్లంఘించి చేపల వేటకు పాల్పడే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోనున్నారు. ఈ నిషేధం వల్ల ఉపాధిపై ప్రభావం పడే సుమారు 11 వేల మత్స్యకార కుటుంబాలకు ఒక్కొక్క కుటుంబానికి రూ.15 వేల చొప్పున ఆర్థిక సహాయం అందించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. అరుదైన సముద్ర జీవరాశుల పరిరక్షణతో పాటు మత్స్యకారుల జీవనోపాధిని దృష్టిలో ఉంచుకుని చేపట్టిన ఈ చర్యలు ఆలివ్ రిడ్లే తాబేళ్ల సురక్షిత సంతానోత్పత్తికి దోహదపడనున్నాయి.

హైదరాబాద్‌ను పరిశుభ్రమైన నగరంగా, ట్రాఫిక్ ఫ్రీ సిటీగా తీర్చిదిద్దాలి: సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 2 (సందేశం టైమ్స్): హైదరాబాద్ నగరాన్ని పరిశుభ్రమైన నగరంగా, ట్రాఫిక్ సమస్యలు లేని నగరంగా తీర్చిదిద్దేందుకు అధికారులు సమగ్ర ప్రణాళికతో పనిచేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశించారు. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో మున్సిపల్, హెచ్ఎండీఏ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో నగర పారిశుధ్యం, చెత్త సేకరణ, నిర్మాణ వ్యర్థాల నిర్వహణ, గ్రీన్ వాటర్ వినియోగం, ట్రాఫిక్ సమస్యలపై పలు సూచనలు చేశారు. నగరంలో ఎక్కడా చెత్త కనిపించకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని, ప్రతిరోజూ ఇంటింటికీ చెత్త సేకరణ జరిగేలా చర్యలు తీసుకోవాలని, విధుల్లో నిర్లక్ష్యం వహించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. నిర్మాణ వ్యర్థాల తరలింపునకు ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతో పాటు పారిశ్రామిక ప్రాంతాల్లో చెత్త సేకరణ కోసం ఇండస్ట్రియల్ లోకల్ అథారిటీ అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. నగరంలోని నిర్మాణ పనులు, పార్కుల నిర్వహణ, ల్యాండ్‌స్కేపింగ్, గార్డెనింగ్ తదితర అవసరాలకు తాగునీటిని వినియోగించకుండా మురుగునీటి శుద్ధి కేంద్రాల్లో (ఎస్టీపీ) శుద్ధి చేసిన నీటిని ఉపయోగించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. జలమండలి తొలివిడతలో 19 ఎస్టీపీల నుంచి 28 గ్రీన్ వాటర్ ట్యాంకర్ల ద్వారా సేవలను అందుబాటులోకి తీసుకొచ్చిందని, జీహెచ్ఎంసీతో పాటు సీఎంసీ, ఎంఎంసీ పరిధుల్లోనూ గ్రీన్ వాటర్ సరఫరాను మరింత విస్తరించాలని సూచించారు. నిర్మాణ రంగం, పార్కుల అభివృద్ధి, పచ్చదనం నిర్వహణ వంటి అవసరాలకు శుద్ధి చేసిన నీటిని వినియోగించడం ద్వారా తాగునీటిని ఆదా చేయవచ్చని పేర్కొన్నారు. అదేవిధంగా నగరంలో ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా చర్యలు చేపట్టాలని, సాధ్యమైనంత వరకు సిగ్నల్ ఫ్రీ ప్రయాణ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన ప్రాంతాల్లో అండర్‌పాస్‌లు, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని, ట్రాఫిక్ సిగ్నళ్ల వద్ద వాహనాలు ఎక్కువసేపు నిలిచిపోకుండా రాకపోకలు నిరంతరాయంగా సాగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీ వేం నరేందర్ రెడ్డితో పాటు హెచ్ఎండీఏ, మున్సిపల్ కార్పొరేషన్ల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



మహిళా పారిశ్రామికవేత్తలకు పెట్టుబడులు, అవకాశాల కల్పనకు ప్రత్యేక మండలి.. ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు సన్నాహాలు

హైదరాబాద్, నవంబర్ 2 (సందేశం టైమ్స్): తెలంగాణ రాష్ట్రంలో మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం, మహిళల ఆధ్వర్యంలో నడిచే వ్యాపార సంస్థలకు పెట్టుబడులు, మార్కెట్ అవకాశాలు, ప్రభుత్వ విధానపరమైన సహకారం అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో డిసెంబర్ 7 నుంచి 9 వరకు హైదరాబాద్‌లోని భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్–2026కు ముందస్తుగా మహిళా పారిశ్రామికవేత్తల ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (WEEC)ను ఏర్పాటు చేసి సమావేశాన్ని నిర్వహించింది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి డి. అనసూయ సీతక్క అధ్యక్షతన, డబ్ల్యూఈ హబ్ సీఈఓ సీత పల్లచోళ్ల సభ్య కన్వీనర్‌గా ఈ మండలి పనిచేయనుంది. దేశవ్యాప్తంగా విధాన రూపకర్తలు, మహిళా పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, కార్పొరేట్ సంస్థల ప్రతినిధులు, వ్యాపార రంగ నిపుణులను ఒకే వేదికపైకి తీసుకొచ్చి మహిళల ఆధ్వర్యంలోని సంస్థలకు ఆర్థిక సహాయం, మార్కెట్ అనుసంధానం, ప్రభుత్వ విధానపరమైన మద్దతు, వ్యాపార నెట్‌వర్క్‌లను మరింత విస్తరించేందుకు అవసరమైన కార్యాచరణపై ఈ మండలి చర్చించనుంది. భారతదేశంలో 2025లో పూర్తిగా మహిళల ఆధ్వర్యంలో ఏర్పాటైన స్టార్టప్‌లు ప్రైవేట్ పెట్టుబడుల్లో కేవలం 0.97 శాతం మాత్రమే సమీకరించుకున్నాయని డీల్‌స్ట్రీట్‌ఏషియా నిధుల సమీక్షలో వెల్లడైన నేపథ్యంలో ఈ పరిస్థితిని మార్చేందుకు ప్రత్యేక దృష్టి సారించనున్నారు. మహిళా వ్యాపారాలను సంక్షేమ కార్యక్రమాల కోణంలో కాకుండా దేశ ఆర్థికాభివృద్ధికి, పోటీతత్వానికి దోహదపడే కీలక రంగంగా గుర్తించాలని మంత్రి సీతక్క పేర్కొన్నారు. మహిళలు పట్టణాలు, గ్రామాలు, స్వయం సహాయక సంఘాల ద్వారా వివిధ వ్యాపారాలను విజయవంతంగా నిర్వహిస్తున్నారని, వారికి అవసరమైన పెట్టుబడులు, మార్కెట్లు, విధానపరమైన సహకారం అందించాల్సిన అవసరం ఉందన్నారు. మహిళా పారిశ్రామికవేత్తలకు ఎదురవుతున్న అడ్డంకులను తొలగించేందుకు ప్రభుత్వం డబ్ల్యూఈ హబ్ ద్వారా కృషి చేస్తుందని తెలిపారు. ఈ మండలి కార్యకలాపాలను నాలుగు ప్రధాన విభాగాలుగా విభజించారు. పాలసీ అండ్ ఇన్‌స్టిట్యూషనల్ లీడర్‌షిప్ విభాగానికి సెర్ప్, మెప్మా సీఈఓ దివ్య దేవరాజన్ నాయకత్వం వహించనుండగా, అర్బన్ ఇన్నోవేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ విభాగానికి ఈడీటీ వ్యవస్థాపకురాలు, సీఈఓ నయ్యా సాగ్గి, సోషల్ ఇంపాక్ట్ అండ్ ఇన్‌క్లూజివ్ ఎంటర్‌ప్రైజ్ విభాగానికి సెల్కో వ్యవస్థాపకుడు, ఎండీ డాక్టర్ హరీష్ హండే, క్యాపిటల్, ఇన్వెస్ట్‌మెంట్ అండ్ కార్పొరేట్ పార్ట్‌నర్‌షిప్స్ విభాగానికి అరిస్ వెంచర్స్ వ్యవస్థాపకురాలు, మేనేజింగ్ పార్ట్‌నర్ అంకితా వశిష్ఠ నాయకత్వం వహించనున్నారు. ప్రతి విభాగం మహిళా వ్యాపార రంగంలో మార్పులు తీసుకురావడానికి ఏ అంశాల్లో మార్పులు అవసరం, వాటిని ఎవరు అమలు చేయగలరు, రాబోయే 12 నుంచి 24 నెలల్లో తెలంగాణలో ఎలాంటి ప్రయోగాత్మక కార్యక్రమాలు చేపట్టవచ్చు, విజయవంతమైన నమూనాలను రాష్ట్రవ్యాప్తంగా ఎలా విస్తరించవచ్చు అనే నాలుగు అంశాలపై అధ్యయనం చేయనుంది. ఈ విభాగాల సిఫారసులతో మహిళా పారిశ్రామికవేత్తల ప్రస్తుత పరిస్థితి, ఎదుర్కొంటున్న సవాళ్లు, పెట్టుబడుల అవకాశాలు, భవిష్యత్ కార్యాచరణపై సమగ్ర శ్వేతపత్రాన్ని రూపొందించి డిసెంబర్‌లో జరిగే గ్లోబల్ సమ్మిట్‌లో విడుదల చేయనున్నారు. ఈ శ్వేతపత్రం ప్రచురణ భాగస్వామిగా ఎర్నెస్ట్ అండ్ యంగ్ (EY) వ్యవహరించనుంది. ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, పరిశ్రమలు మరియు వాణిజ్యం, పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల ద్వారా మండలి సిఫారసులను అమలు చేయడంలో డబ్ల్యూఈ హబ్ కీలక సమన్వయ సంస్థగా వ్యవహరించనుంది. మహిళా వ్యాపారవేత్తలకు పెట్టుబడులు, వినియోగదారులు, వ్యాపార నెట్‌వర్క్‌లకు చేరువయ్యే అవకాశాలు కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని డబ్ల్యూఈ హబ్ సీఈఓ సీత పల్లచోళ్ల తెలిపారు.

విశ్రాంత ఐపీఎస్ అధికారి బాలసుబ్రహ్మణ్యానికి సీఎం చంద్రబాబు నివాళి



విజయవాడ, నవంబర్ 2 (సందేశం టైమ్స్): విశ్రాంత ఐపీఎస్ అధికారి ఎస్. బాలసుబ్రహ్మణ్యం పార్థివదేహానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఘనంగా నివాళులర్పించారు. విజయవాడలోని ఎంజీ రోడ్డులో ఉన్న పోలీస్ ఆర్మ్డ్ రిజర్వ్ గ్రౌండ్స్‌కు చేరుకున్న ముఖ్యమంత్రి పుష్పగుచ్ఛం ఉంచి దివంగత అధికారి భౌతికకాయానికి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ ధైర్యం చెప్పారు. ఇటీవల అమెరికాలో క్యాన్సర్‌కు చికిత్స పొందుతూ బాలసుబ్రహ్మణ్యం కన్నుమూశారు. ఆయన పార్థివదేహాన్ని విజయవాడకు తీసుకువచ్చి ప్రజల సందర్శనార్థం పోలీస్ ఆర్మ్డ్ రిజర్వ్ గ్రౌండ్స్‌లో ఉంచారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ బాలసుబ్రహ్మణ్యం ఆకస్మిక మరణం తీవ్రంగా బాధించిందని, పదవీ విరమణ చేసిన రెండు నెలలకే ఆయన మరణించడం విచారకరమని అన్నారు. క్యాన్సర్‌తో పోరాడుతూనే చికిత్స పొందుతున్న సమయంలోనూ విధుల పట్ల నిబద్ధతతో వ్యవహరించారని గుర్తుచేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో పాటు రాష్ట్ర విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్‌లోనూ ఆయన పలు కీలక బాధ్యతలు నిర్వహించారని తెలిపారు. జగిత్యాల వంటి సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసు అధికారిగా సేవలందించడంతో పాటు ఇంటెలిజెన్స్ విభాగంలోనూ తనదైన ముద్ర వేశారని పేర్కొన్నారు. పోలీసు శాఖలో సుమారు మూడు దశాబ్దాల పాటు సేవలందించిన ఆయన సాంకేతిక పరిజ్ఞానంపై ఆసక్తితో ప్రభుత్వ పాలనా వ్యవస్థల్లో ఆధునిక మార్పులకు కృషి చేశారని, ఈ-ప్రగతి, ఆర్టీజీఎస్ వంటి వ్యవస్థల రూపకల్పనలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. రవాణా శాఖలోనూ, ఆర్టీసీ ఎండీగా పనిచేసిన సమయంలోనూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు పలు సంస్కరణలు చేపట్టారని గుర్తుచేశారు. ప్రజాహితం, నిజాయితీ, అంకితభావంతో పనిచేసిన సమర్థవంతమైన అధికారిని రాష్ట్రం కోల్పోయిందని సీఎం పేర్కొంటూ ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.



ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మించి బియ్యం విక్రయిస్తే కఠిన చర్యలు

సూర్యాపేట, నవంబర్ 2 (సందేశం టైమ్స్): జిల్లాలో బియ్యం విక్రయాలు ప్రభుత్వం నిర్దేశించిన ధరల ప్రకారమే జరగాలని, నిర్ణయించిన ధరలకు మించి బియ్యం విక్రయించే వ్యాపారులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ స్పష్టం చేశారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో సూర్యాపేట, హుజూర్‌నగర్, కోదాడ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, జిల్లా హోల్‌సేల్ రైస్ డీలర్లతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో బియ్యం ధరలను నియంత్రించి, వినియోగదారులకు సరసమైన ధరలకు బియ్యం అందుబాటులో ఉండేలా రైస్ మిల్లర్లు, హోల్‌సేల్ డీలర్లు సహకరించాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరల కంటే అధిక ధరలకు బియ్యం విక్రయించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంతేకాకుండా ప్రభుత్వం నిర్ణయించిన బియ్యం ధరల పట్టికను అన్ని విక్రయ కేంద్రాల్లో ప్రజలకు స్పష్టంగా కనిపించే విధంగా ప్రదర్శించాలని ఆదేశించారు. ధరల విషయంలో పారదర్శకత పాటిస్తూ వినియోగదారుల ప్రయోజనాలను కాపాడేందుకు వ్యాపారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. సమావేశంలో పాల్గొన్న రైస్ మిల్లర్లు, హోల్‌సేల్ డీలర్లు ప్రభుత్వం నిర్దేశించిన ధరల ప్రకారమే బియ్యం విక్రయిస్తామని, ధరల పట్టికను తమ దుకాణాల్లో తప్పనిసరిగా ప్రదర్శిస్తామని కలెక్టర్‌కు హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, జిల్లా పౌర సరఫరాల అధికారి మోహన్ బాబు, సివిల్ సప్లైస్ జిల్లా మేనేజర్ శ్రీధర్ రెడ్డి, సంబంధిత సిబ్బంది, జిల్లాలోని రైస్ మిల్లర్లు, హోల్‌సేల్ రైస్ డీలర్లు పాల్గొన్నారు.



ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలంటే విషయ పరిజ్ఞానంతో పాటు మానసిక సంసిద్ధత అవసరం: కలెక్టర్, ఎస్పీ

సూర్యాపేట, నవంబర్ 2 (సందేశం టైమ్స్): ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు జిల్లా యంత్రాంగం, జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ కార్యక్రమంలో భాగంగా పాత ఎస్పీ కార్యాలయంలో శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, జిల్లా ఎస్పీ నరసింహ అధికారుల సమక్షంలో స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలంటే విషయ పరిజ్ఞానంతో పాటు మానసికంగా కూడా సిద్ధంగా ఉండాలని సూచించారు. జిల్లా ఎస్పీ ప్రత్యేక ప్రణాళికతో, రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సహకారంతో నాణ్యమైన ఉచిత శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా మొత్తం 400 మంది అభ్యర్థులకు ఉచిత శిక్షణతో పాటు వసతి సౌకర్యం కల్పిస్తున్నామని, సూర్యాపేటలో 200 మందికి, కోదాడలో 200 మందికి శిక్షణ ఇస్తున్నామని వివరించారు. నిపుణులైన అధ్యాపకులు, ఫిజికల్ ఈవెంట్స్ శిక్షకుల ఆధ్వర్యంలో శిక్షణ కొనసాగుతోందని పేర్కొన్నారు. అభ్యర్థులు ప్రతి సబ్జెక్టుపై లోతైన అవగాహన పెంపొందించుకోవాలని, చదివిన అంశాలను నోట్ పుస్తకంలో రాసుకోవాలని, గత ప్రశ్నపత్రాలను పరిశీలించి ప్రశ్నల సరళిని అర్థం చేసుకోవాలని సూచించారు. అందుబాటులో ఉన్న సమయానికి అనుగుణంగా ప్రణాళిక రూపొందించుకుని ప్రతి సబ్జెక్టును కనీసం మూడుసార్లు చదివి పునశ్చరణ చేయాలని తెలిపారు. పరీక్షల సమయంలో ఒత్తిడికి గురికాకుండా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని, లక్ష్యాన్ని నిర్దేశించుకుని క్రమశిక్షణతో నిరంతర కృషి చేయాలని యువతకు పిలుపునిచ్చారు. జిల్లా ఎస్పీ నరసింహ మాట్లాడుతూ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే యువతకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలు, అవకాశాలను సద్వినియోగం చేసుకుని పట్టుదలతో చదివి ఉద్యోగాలు సాధించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ మార్గదర్శకత్వంలో, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సహకారంతో ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. శిక్షణ కోసం నిర్వహించిన ఎంపిక పరీక్షకు సుమారు 1,400 మంది అభ్యర్థులు హాజరుకాగా, ప్రతిభ ఆధారంగా వారిలో 400 మందిని ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ఎంపికైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకుని తుది ఫలితాల్లో ఉద్యోగాలు సాధించిన వారి జాబితాలో నిలవాలని ఆకాంక్షించారు. సమయాన్ని వృథా చేయకుండా ప్రణాళికాబద్ధంగా చదువుతూ ఏకాగ్రతతో లక్ష్యం వైపు సాగాలని సూచించారు. నిష్ణాతులైన అధ్యాపకులతో వివిధ సబ్జెక్టుల్లో బోధన అందిస్తున్నామని, అభ్యర్థుల శారీరక దారుఢ్యాన్ని పెంపొందించేందుకు పోలీసు సిబ్బంది ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారని తెలిపారు. అందిస్తున్న స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకుని, అధ్యాపకులు బోధించే ప్రతి అంశాన్ని నోట్ చేసుకుంటూ నిరంతరం సాధన చేయాలని, సమస్యలు, ఒత్తిడిని అధిగమించి ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని అభ్యర్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో శిక్షణ డిప్యూటీ కలెక్టర్లు అనూష, రవితేజ, సూర్యాపేట డివిజన్ డీఎస్పీ ప్రసన్నకుమార్, ఆర్మ్డ్ డీఎస్పీ నరసింహచారి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు ప్రవీణ్ కుమార్, జానయ్య, ఆర్ఎస్ఐలు సురేష్, సాయిరాం, అధ్యాపక బృందం, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఖేలో ఇండియా పోటీలకు అత్యున్నత నాణ్యతా ప్రమాణాలతో శాశ్వత ఏర్పాట్లు చేయాలి: సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 2 (సందేశం టైమ్స్): తెలంగాణలో డిసెంబర్ 11 నుంచి 22 వరకు నిర్వహించనున్న 8వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్ పోటీలకు అత్యున్నత నాణ్యతా ప్రమాణాలతో శాశ్వత ప్రాతిపదికన ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో క్రీడా పోటీల నిర్వహణకు చేపట్టాల్సిన ఏర్పాట్లు, మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ఆయన చర్చించారు. తెలంగాణలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న ఈ పోటీల్లో ఎక్కడా నాణ్యతా ప్రమాణాల లోపం ఉండకూడదని స్పష్టం చేశారు. రాష్ట్రాన్ని దేశంలోనే క్రీడల హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో తెలంగాణ క్రీడా విధానం, యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ ద్వారా ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. ఒలింపిక్స్‌లో పతకాలు సాధించడమే దీర్ఘకాలిక లక్ష్యంగా అంతర్జాతీయ స్థాయి మౌలిక సదుపాయాలు, ప్రపంచస్థాయి శిక్షణను రాష్ట్ర యువ క్రీడాకారులకు అందించేందుకు ఖేలో ఇండియా పోటీలను గొప్ప అవకాశంగా మలుచుకోవాలని సూచించారు. డిసెంబర్ 7 నుంచి 9 వరకు నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లకు వినియోగించే వనరులు, సదుపాయాలను ఖేలో ఇండియా పోటీలకు కూడా ఉపయోగించుకునేలా రెండు కార్యక్రమాల ఏర్పాట్లను సమాంతరంగా చేపట్టాలని ఆదేశించారు. గ్లోబల్ సమ్మిట్‌లో క్రీడలు, క్రీడాభివృద్ధికి పెట్టుబడుల ఆకర్షణ కూడా భాగంగా ఉన్నందున సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దేలా శాశ్వత క్రీడా వనరులను అభివృద్ధి చేయాలని, పోటీలు ముగిసిన తర్వాత కూడా క్రీడా ప్రాంగణాలు రాష్ట్రానికి ఉపయోగపడేలా అత్యున్నత ప్రమాణాలతో తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. ఏర్పాట్ల పర్యవేక్షణకు గ్రూప్-1 స్థాయి అధికారులకు బాధ్యతలు అప్పగించాలని, వివిధ జిల్లాల్లో జరిగే పోటీల కోసం స్థానికంగా పనిచేస్తున్న ట్రైనీ అధికారులు, గ్రూప్-1 అధికారులను నియమించాలని ఆదేశించారు. క్రీడాకారులకు ఆహారం, వసతి సౌకర్యాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, ప్రతి వారం ఏర్పాట్ల పురోగతిపై నివేదిక అందించాలని సూచించారు. గతంలో క్రీడా పోటీల కోసం నిర్మించిన కొన్ని మౌలిక సదుపాయాలు పోటీలు ముగిసిన కొన్నేళ్లకే దెబ్బతిన్నాయని గుర్తుచేస్తూ, గత అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకుని ఈసారి పటిష్ఠమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఎల్ నినో పరిస్థితుల నేపథ్యంలో ప్రారంభ, ముగింపు వేడుకల్లో అనవసర ఆడంబరాలకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఈ పోటీల్లో దేశవ్యాప్తంగా ఏడు వేలకు పైగా యువ క్రీడాకారులు, సుమారు రెండు వేల మంది కోచింగ్ సిబ్బంది, అధికారులు పాల్గొననున్నారు. హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని మరో ఐదు నగరాల్లో మొత్తం 20 వేదికలపై 27 రకాల క్రీడా పోటీలు, ఒక డెమో పోటీ నిర్వహించనున్నారు. ఆతిథ్య రాష్ట్రం తరఫున తెలంగాణ సంప్రదాయ క్రీడ అయిన కర్రసామును కూడా ఖేలో ఇండియా పోటీల్లో చేర్చేలా వెంటనే కార్యాచరణ చేపట్టాలని సీఎం సూచించారు. తెలంగాణకు ప్రాతినిధ్యం వహించే క్రీడాకారులు ప్రతిభ చాటేలా చర్యలు తీసుకుంటున్నామని అధికారులు వివరించారు. ఇప్పటికే వివిధ జిల్లాల్లోని ఖేలో ఇండియా శిబిరాల్లో క్రీడాకారులకు శిక్షణ కొనసాగుతోందని, 20 వేదికల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. ఈ సమావేశంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సీఎం సలహాదారు కె. రామకృష్ణారావు, స్పెషల్ చీఫ్ సెక్రటరీ (స్పోర్ట్స్) వాణీ ప్రసాద్, స్పోర్ట్స్ అథారిటీ ఎండీ సోనిబాలా దేవి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రగతికి, పెట్టుబడుల ఆకర్షణకు 85వ ఐఆర్‌సీ సదస్సును వేదికగా మలచాలి: మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



హైదరాబాద్, నవంబర్ 2 (సందేశం టైమ్స్): తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణకు 85వ ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ (ఐఆర్‌సీ) సదస్సును అంతర్జాతీయ వేదికగా మలచాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని సూచించారు. సోమవారం డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ రాష్ట్ర సచివాలయంలో ఆర్ అండ్ బీ శాఖ ఉన్నతాధికారులతో సుమారు మూడున్నర గంటల పాటు నిర్వహించిన సమీక్షా సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా రోడ్ల నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించి, ఎలాంటి జాప్యం లేకుండా పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఆల్వాల్ టిమ్స్ ఆస్పత్రి, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి ఈ ఏడాదిలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. ఉస్మానియా జనరల్ ఆస్పత్రి, నిమ్స్ విస్తరణ, నూతన హైకోర్టు భవన నిర్మాణాలను కూడా వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ప్రజలకు మెరుగైన రవాణా, వైద్య సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ నెల 19 నుంచి 22 వరకు హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో నిర్వహించనున్న 85వ ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ సదస్సు ఏర్పాట్లపై ప్రత్యేకంగా సమీక్షించారు. ఈ నెల 19న కేంద్ర రోడ్లు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా సదస్సు ఘనంగా ప్రారంభం కానుందని తెలిపారు. కేంద్ర మంత్రులు, వివిధ రాష్ట్రాల రోడ్లు, భవనాల శాఖ మంత్రులు, దేశంలోని వివిధ ప్రాంతాల ప్రతినిధులు, అంతర్జాతీయ ప్రతినిధులు, ఇంజనీరింగ్ రంగ నిపుణులు హాజరుకానున్న ఈ సదస్సును కేవలం సాంకేతిక చర్చలకే పరిమితం చేయకుండా తెలంగాణలోని అభివృద్ధి, మౌలిక వనతులు, పెట్టుబడి అవకాశాలను ప్రపంచానికి పరిచయం చేసే వేదికగా వినియోగించుకోవాలని మంత్రి సూచించారు. హైటెక్స్ ప్రాంగణంలో సుమారు 400 ఎగ్జిబిషన్ స్టాళ్లతో పాటు ప్రత్యేకంగా తెలంగాణ పెవిలియన్ ఏర్పాటు చేసి రాష్ట్ర చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు, కళలు, పర్యాటక ప్రాంతాలు, అభివృద్ధి కార్యక్రమాలు, భారీ మౌలిక వనతుల ప్రాజెక్టులు, పెట్టుబడి అవకాశాలను ప్రదర్శించాలని ఆదేశించారు. నాలుగు రోజుల పాటు ప్రతిరోజూ కనీసం గంటసేపు తెలంగాణ కళాకారుల ప్రదర్శనలు నిర్వహించాలని, అతిథులకు రాష్ట్ర సంస్కృతిని ప్రతిబింబించే జ్ఞాపికలు అందించాలని సూచించారు. సదస్సులో జరిగే ముఖ్య కార్యక్రమాలను ప్రత్యక్ష ప్రసారం చేసేలా ఏర్పాట్లు చేయాలని, పర్యాటక శాఖ సమన్వయంతో అతిథులు రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాలు, చారిత్రక కట్టడాలు, పర్యాటక ప్రాంతాలను సందర్శించేలా ప్రత్యేక పర్యటన కార్యక్రమాలు రూపొందించాలని తెలిపారు. ఐఆర్‌సీ సదస్సుకు హైదరాబాద్‌తో పాటు ఢిల్లీ, ముంబై, బెంగళూరు నగరాల్లోనూ విస్తృత ప్రచారం చేపట్టాలని, విమానాశ్రయాలు, మెట్రో స్టేషన్లు, రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు వంటి ప్రధాన కేంద్రాల్లో హోర్డింగులు, విజువల్ ప్రకటనలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్, సోషల్ మీడియా వేదికలను సమర్థంగా వినియోగించుకుని సదస్సుకు జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావాలని సూచించారు. డిసెంబర్‌లో భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ' గ్లోబల్ సమ్మిట్‌కు 85వ ఐఆర్‌సీ సదస్సు ప్రీ-సమ్మిట్‌గా నిలవాలని మంత్రి ఆకాంక్షించారు. సదస్సుకు హాజరయ్యే కేంద్ర మంత్రులు, వివిధ రాష్ట్రాల మంత్రులు, అంతర్జాతీయ ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులకు తెలంగాణలోని పెట్టుబడి అవకాశాలు, పారిశ్రామిక అనుకూల వాతావరణం, రవాణా సదుపాయాలు, భవిష్యత్ ప్రాజెక్టులను వివరించేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. అతిథులకు వసతి, రవాణా, ఆహారం, భద్రత, ఆతిథ్య ఏర్పాట్లలో ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ సదస్సు ద్వారా రాష్ట్ర రోడ్ నెట్‌వర్క్, రైల్వే ప్రాజెక్టులకు సంబంధించి కీలక ప్రకటనలు వెలువడే అవకాశం ఉందని, ఇది తెలంగాణ అభివృద్ధిలో ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఆర్ అండ్ బీ శాఖ కార్యదర్శి ఇలంబర్తి, స్పెషల్ సెక్రటరీ గంగాధర్, కేంద్ర రోడ్లు రవాణా, జాతీయ రహదారుల శాఖ (MoRTH) రీజినల్ ఆఫీసర్ కృష్ణ ప్రసాద్, ఎన్‌హెచ్ఏఐ రీజినల్ ఆఫీసర్ శివశంకర్, ఆర్ అండ్ బీ చీఫ్ ఇంజనీర్లు లింగారెడ్డి, బి.వి.రావు, వసంత్ నాయక్, ధర్మారెడ్డి, నర్సింగ్‌రావు, రాజేందర్, రాజేశ్వర్‌రెడ్డి తదితర ఉన్నతాధికారులు, ఇంజనీర్లు పాల్గొన్నారు.



నర్సాపూర్‌లో ఘనంగా వరి కొనుగోలు కేంద్రాల ప్రారంభం

మెదక్ జిల్లా నర్సాపూర్, నవంబర్ 02 (సందేశం టైమ్స్ ప్రతినిధి): నర్సాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) ఆధ్వర్యంలో సోమవారం వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీతా లక్ష్మారెడ్డి చేతుల మీదుగా కాగజ్‌మద్దూర్, నర్సాపూర్, పెద్దచింతకుంట, భాజిపేట గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకొని తమ ధాన్యాన్ని మద్దతు ధరకు విక్రయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ లక్ష్మీ రాజు యాదవ్, పీఏసీఎస్ చైర్మన్ రాజు యాదవ్, పెద్దచింతకుంట సర్పంచ్ శివకుమార్, ఉపసర్పంచ్ అంజయ్య, వార్డు సభ్యులు, రైతులు విఠల్, యాదగౌడ్, గౌరయ్య, నరేందర్, మల్లేశం, వెంకటేష్, రాజుతో పాటు పీఏసీఎస్ సిబ్బంది వెంకటస్వామి, శ్రీనివాస్, కుమార్, గోపాల్, పెద్దచింతకుంట కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



కబడ్డీ పోటీల్లో ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయికి ఆక్స్‌ఫర్డ్ విద్యార్థులు






సంగారెడ్డి జిల్లా, నవంబర్ 02 (సందేశం టైమ్స్ ప్రతినిధి): అందోల్ నియోజకవర్గంలోని జోగిపేట పట్టణంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో జోగిపేట ఆక్స్‌ఫర్డ్ పాఠశాల విద్యార్థులు దైవీక్, శ్రీశాంత్, దీక్షిత్ కబడ్డీ క్రీడలో జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. అదేవిధంగా వాలీబాల్ పోటీల్లో అందోల్ జట్టు ద్వితీయ స్థానం సాధించగా, ఆ జట్టులో ఆక్స్‌ఫర్డ్ విద్యార్థులు విజ్ఞాశ్రీ, నిహారిక పాల్గొని ప్రతిభ కనబరిచారు. జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ దాసరి నాగేశ్వర్, ప్రిన్సిపాల్ డాల్ఫిన్ లివర్, పీఈటీలు నర్సిములు, భానుతేజతో పాటు ఉపాధ్యాయ బృందం అభినందించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి – ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు



నూర్యాపేట, నవంబర్ 2 (సందేశం టైమ్స్ నూర్యాపేట జిల్లా కో ఆర్డినేటర్ సోమయ్య కంభంపాటి): తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు తమ సమస్యల పరిష్కారం కోసం నూర్యాపేట జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాకు ఏఐటీయూసీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ సందర్భంగా ధర్నాలో పాల్గొని మాట్లాడిన ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు మాట్లాడుతూ అంగన్వాడీ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన రూ.18 వేల వేతన హామీని అమలు చేయాలని, బీఎల్ఓ విధుల నుంచి అంగన్వాడీ సిబ్బందికి మినహాయింపు కల్పించాలని, అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. అలాగే పీఎఫ్, హెల్త్ కార్డులు, రూ.20 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని, నెలకు రూ.10 వేల పెన్షన్ అందించాలని, ప్రాథమిక పాఠశాలల రద్దు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, గ్రూప్-2 సూపర్వైజర్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు. ఇతర పెండింగ్ డిమాండ్లను కూడా ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు, పోరాటాలు కొనసాగిస్తామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ నాయకురాళ్లు ఆర్. స్వప్న, జి. రమ, బి. నుమిత్ర, సునీత, నరస్వతి, అరుణ, షాహిదా, ఝాన్సీతో పాటు ఏఐటీయూసీ జిల్లా గౌరవ సలహాదారు శ్యామల అశోక్, గౌరవ అధ్యక్షుడు దంతాల రాంబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ గుగులోతు రాజారాం, సీపీఐ నూర్యాపేట పట్టణ కమిటీ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, మహిళా నాయకురాళ్లు పద్మ, రేఖ, ఏఐటీయూసీ అంగన్వాడీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



రైతుల ధాన్యం కొనుగోళ్లలో జాప్యం సహించేది లేదు.. బోనస్ బకాయిలు వెంటనే చెల్లించాలి: ఎమ్మెల్యే చింత ప్రభాకర్

సంగారెడ్డి జిల్లా, నవంబర్ 2 (సందేశం టైమ్స్ ప్రతినిధి): రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ అధికారులకు సూచించారు. రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వ మద్దతు ధరకు కొనుగోలు చేయాలని, కొనుగోలు కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలని స్పష్టం చేశారు. సదాశివపేట మండలం పెద్దాపూర్ రైతు వేదికలో నందికంది పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించడంతో పాటు సంగారెడ్డి మండలం నాగపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కూడా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో రైతులందరికీ సమాన ప్రాధాన్యత కల్పించాలని, దళారీ వ్యవస్థకు తావులేకుండా నేరుగా రైతుల నుంచే ధాన్యం సేకరించాలని సూచించారు. ప్రతి క్వింటాల్ సన్న ధాన్యానికి ప్రభుత్వం ప్రకటించిన రూ.500 బోనస్‌ను తప్పనిసరిగా అందించాలని, గత ఏడాది నుంచి పెండింగ్‌లో ఉన్న బోనస్ బకాయిలను వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ కోతలు, పంట రుణాలు, ఎరువుల కొరత వంటి సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరినట్లు వెల్లడించారు. కొనుగోలు కేంద్రాల్లో సరిపడా గన్నీ బ్యాగులు, టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని, ధాన్యం రవాణాలో ఎలాంటి జాప్యం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.



కోహెన్స్ ఫార్మా కంపెనీపై సిట్టింగ్ జడ్జితో సమగ్ర న్యాయవిచారణ చేపట్టాలి – ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న కంపెనీపై కఠిన చర్యలు తీసుకోవాలి

నూర్యాపేట, నవంబర్ 02 (సందేశం టైమ్స్) నూర్యాపేట జిల్లా కో ఆర్డినేటర్ సోమయ్య కంభంపాటి): నూర్యాపేట జిల్లా కేంద్రంలోని కోహెన్స్ ఫార్మా కంపెనీలో చోటుచేసుకున్న ఉద్యోగి మృతి ఘటనతో పాటు కంపెనీ నిర్వహణ, భద్రతా ప్రమాణాలు, పర్యావరణ కాలుష్యం, పరిసర ప్రాంతాల ప్రజల ఆరోగ్యంపై చూపుతున్న ప్రభావాలపై సమగ్ర విచారణ జరపాలని సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్, సీపీఐ నాయకులు, తండాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్, సీపీఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కంపెనీలో జరుగుతున్న ప్రమాదాలు, కార్మికుల భద్రత పట్ల యాజమాన్యం నిర్లక్ష్యం, చుట్టుపక్కల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై వాస్తవాలను వెలికితీసేందుకు హైకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయవిచారణ చేపట్టాలని కోరారు. విచారణ పూర్తయ్యే వరకు కంపెనీ కార్యకలాపాలను నిలిపివేయాలని, ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగించే పరిస్థితులు ఉన్నట్లు తేలితే కంపెనీని మూసివేయాలని లేదా జనావాసాలకు దూరంగా తరలించాలని డిమాండ్ చేశారు. మృతి చెందిన ఉద్యోగి కుటుంబానికి రూ.5 కోట్ల నష్టపరిహారం చెల్లించడంతో పాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కోరారు. ఘటనకు బాధ్యులైన కంపెనీ యాజమాన్యంపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజల ప్రాణాలు, కార్మికుల భద్రత కంటే కంపెనీ లాభాలకే ప్రాధాన్యత ఇచ్చే ధోరణిని ప్రభుత్వం విడనాడాలని, బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు, ప్రజల ఆరోగ్యానికి భద్రత కల్పించే వరకు తమ పోరాటాన్ని కొనసాగిస్తామని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రేణుక, పీడీఎన్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎర్ర అఖిల్ కుమార్, సీపీఐ సీనియర్ నాయకులు చాపల అశోక్ కుమార్, మాస్ లైన్ నాయకులు పేర్ల నాగయ్య, చక్రు నాయక్, శివరామ్, పీఓడబ్ల్యూ నాయకులు జయమ్మ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి – జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



నూర్యాపేట, నవంబర్ 2 (సందేశం టైమ్స్) నూర్యాపేట జిల్లా కో ఆర్డినేటర్ సోమయ్య కంభంపాటి): ప్రజల సమస్యల పరిష్కారానికి వేదికగా నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ అందిన దరఖాస్తులను నిర్ణీత గడువులోగా సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. సోమవారం నమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం అనంతరం జిల్లా అధికారులతో నమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని, ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లా, మండల స్థాయిలో అందే ప్రజావాణి దరఖాస్తులన్నింటినీ ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. ప్రజావాణి పోర్టల్‌లో పరిష్కారం కాకుండా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని, కొత్తగా అందే దరఖాస్తులను ఎప్పటికప్పుడు పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. ముఖ్యంగా రాష్ట్ర స్థాయి ప్రజావాణిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని, ప్రతి అధికారి తమ లాగిన్‌లో ఉన్న పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని, నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు సమర్పించిన అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మండల స్థాయిలో ప్రారంభమైన ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా జిల్లా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. మండల స్థాయి సమస్యలను స్థానికంగానే పరిష్కరిస్తే ప్రజలకు ఇబ్బందులు తగ్గుతాయని పేర్కొన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 104 దరఖాస్తులు అందాయని, వీటిలో భూ సమస్యలు, రెవెన్యూ శాఖకు సంబంధించి 50, డీపీఓకు 6, పీడీ హౌసింగ్‌కు 6, డీడబ్ల్యూఓకు 5, డీఈఓకు 5, మిగిలిన 32 దరఖాస్తులు వివిధ శాఖలకు సంబంధించినవని కలెక్టర్ తెలిపారు. అందిన దరఖాస్తులను పరిష్కార నిమిత్తం సంబంధిత శాఖలకు పంపించినట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, డీఆర్ఓ ప్రేమ్ రాజ్, జడ్పీ సీఈఓ శిరీష, డీఆర్డీఓ పీడీ నన్యానయ్య, డీఈఓ శ్రీనివాస్, డీఎన్ఓ మోహన్ బాబు, డీడబ్ల్యూఓ నరసింహారావు, డీఎంహెచ్ఓ వెంకటరమణ, సీపీఓ కిషన్, సీఎఫ్ఓ దామోదర్ రెడ్డి, శ్రీనివాసరావు, డీఐఈఓ సులోచన రాణి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఉపేందర్, మున్సిపల్ కమిషనర్ హనుమంత్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మెదక్ జిల్లాలో ఘనంగా జిల్లా స్థాయి కళా, సాంస్కృతిక పోటీలు.. విజేతలకు బహుమతులు అందజేసిన అదనపు కలెక్టర్ నగేష్



మెదక్, నవంబర్ 2 (సందేశం టైమ్స్ ప్రతినిధి): మెదక్ జిల్లా పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కళా, సాంస్కృతిక పోటీలను ఘనంగా నిర్వహించారు. ఈ పోటీల్లో జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ కళా ప్రతిభను ప్రదర్శించారు. ఈ సందర్భంగా విజేతలుగా నిలిచిన విద్యార్థులకు జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. చదువుతో పాటు కళలు, సాంస్కృతిక కార్యక్రమాలపై విద్యార్థులకు ఆసక్తి పెంపొందించడం అవసరమని, ఇలాంటి పోటీలు వారిలో ఆత్మవిశ్వాసం, సృజనాత్మకతను పెంపొందించడంతో పాటు అంతర్లీనంగా ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి.. అధికారులకు ఆదేశించిన జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్

నర్సాపూర్, నవంబర్ 2 (సందేశం టైమ్స్ ప్రతినిధి): మెదక్ జిల్లా నర్సాపూర్ ఏరియా ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ శుక్రవారం డీసీహెచ్ శివ దయాలతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించి రోగులకు అందుతున్న వైద్య సేవలు, వైద్యులు, సిబ్బంది అందుబాటు, విధుల హాజరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది హాజరు రికార్డులను పరిశీలించి, వైద్యులు, సిబ్బంది విధులకు సమయపాలనతో హాజరై రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ముందస్తు ప్రణాళికలు రూపొందించి, రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన వైద్య సేవలు నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, వాటిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ వంశీ, వైద్యులు మీర్జా, గైనకాలజిస్ట్ ప్రేమ వర్ధిని, డాక్టర్ దుర్గ, అనస్థీటిస్ట్, సివిల్ సర్జన్ రాము, వసుధ, వీణ, ప్రియదర్శిని, నర్సింగ్ అధికారులు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



బైరన్ దిబ్బలో పత్తి రైతులను పరామర్శించిన ఆందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్.. పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని డిమాండ్

అల్లాదుర్గం, నవంబర్ 2 (సందేశం టైమ్స్ మెదక్ జిల్లా ఇన్‌చార్జి): మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలం బైరన్ దిబ్బ గ్రామంలో వర్షాభావ పరిస్థితులు, అధిక ఎండల కారణంగా పత్తి పంట తీవ్రంగా దెబ్బతిని నష్టాలను ఎదుర్కొంటున్న రైతులను ఆందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ పరామర్శించారు. ఈ సందర్భంగా పత్తి రైతులతో మాట్లాడి వారి సమస్యలను, పంట నష్టాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం వెంటనే గుర్తించి ఆదుకోవాలని కోరారు. ఈ సందర్భంగా చంటి క్రాంతి కిరణ్ మాట్లాడుతూ రైతన్నల కష్టాలను ప్రభుత్వం గుర్తించి, ఎండిపోయిన పత్తి పంటకు తగిన నష్టపరిహారం అందించేలా సంబంధిత అధికారులతో మాట్లాడతామని, రైతులకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం తక్షణమే పరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతుల పక్షాన ఎల్లప్పుడూ నిలబడేది బీఆర్ఎస్ పార్టీయేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామస్తులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సమస్యలను వివరించి, తక్షణ సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు.



త్రాగునీటిని వృథా చేయవద్దు.. ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు పటిష్ట ప్రణాళిక రూపొందించాలి – జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

కొడిపల్లి, నవంబర్ 2 (సందేశం టైమ్స్ ప్రతినిధి): ఎల్‌నినో ప్రభావం వల్ల భవిష్యత్తులో త్రాగునీటి సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున ప్రజలందరూ నీటిని పొదుపుగా వినియోగిస్తూ త్రాగునీటిని వృథా చేయవద్దని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ సూచించారు. శుక్రవారం కొడిపల్లి మండలం ధర్మసాగర్ గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్, ఎంపీడీవోతో కలిసి గ్రామంలోని నీటి వనరుల లభ్యత, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు, వి.బి.-జి. రామ్ జీ ఉపాధి హామీ పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అధికారులు పటిష్టమైన ప్రణాళిక రూపొందించాలని, నీటి వనరులను సంరక్షిస్తూ ప్రజలకు త్రాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామంలో మొదటి, రెండో విడతలో మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల గ్రౌండింగ్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని, ఇళ్లు మంజూరై నిర్మాణాలు ప్రారంభించని లబ్ధిదారులకు అవగాహన కల్పించి, అధికారుల సూచనల మేరకు తక్కువ ఖర్చుతో నాణ్యమైన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకునేలా ప్రోత్సహించాలని ఆదేశించారు. అలాగే వి.బి.-జి. రామ్ జీ ఉపాధి హామీ పథకం కింద చేపట్టే వివిధ పనుల్లో కూలీల సంఖ్యను పెంచి గ్రామీణ ప్రజలకు మరింత ఉపాధి కల్పించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, స్థానిక సర్పంచ్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మానూర్‌లో బాలికలకు ఆరోగ్య పరీక్షలు.. ఆరోగ్యం, విద్య, హక్కులు, సాధికారతపై అవగాహన కార్యక్రమం



నారాయణఖేడ్, నవంబర్ 2(సందేశం టైమ్స్ ప్రతినిధి): సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గంలోని మానూర్ మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా మహిళా సాధికారత కేంద్రం, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, మానూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో భేటీ బచావో – భేటీ పడావో కార్యక్రమంలో భాగంగా బాలికలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, ఆరోగ్యం, విద్య, హక్కులు, సాధికారతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు రక్తహీనత వల్ల కలిగే సమస్యలు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఐసీడీఎస్ నారాయణఖేడ్ ప్రాజెక్టు సీడీపీఓ ఎల్. సుజాత మాట్లాడుతూ బాలికలు తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. మానూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ స్టాలిన్ రక్తహీనత వల్ల కలిగే అనారోగ్య సమస్యలు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. జిల్లా మహిళా సాధికారత కేంద్రం సమన్వయకర్త గడ్డం పల్లవి మాట్లాడుతూ బాలికల హక్కులు, విద్య ప్రాముఖ్యత, సురక్షిత స్పర్శ, అసురక్షిత స్పర్శ, రుతుక్రమ పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. బాలికలు తమ హక్కులను తెలుసుకొని ఆత్మవిశ్వాసంతో చదువులో రాణిస్తూ జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వైద్యనాథ్, సీహెచ్ఓ ప్రభాకర్, జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆర్థిక నిపుణులు పి. నర్సింలు, ఏఎన్ఎంలు, ఆరోగ్య పర్యవేక్షకులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌నినోపై అవగాహన ర్యాలీ.. నీటి పొదుపుపై కమిషనర్ పిలుపు



నర్సాపూర్, నవంబర్ 2 (సందేశం టైమ్స్ ప్రతినిధి): మెదక్ జిల్లా నర్సాపూర్ మున్సిపల్ పరిధిలోని శ్రీ వత్సల్ గురుకుల విద్యాలయం ఆధ్వర్యంలో ఎల్‌నినో ప్రభావం, భవిష్యత్తులో నీటి ఎద్దడి నివారణపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నృత్య ప్రదర్శనతో పాటు ర్యాలీ చేపట్టి నీటి సంరక్షణ ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో కరువు, తాగునీటి కొరత ఏర్పడే ప్రమాదం ఉన్నందున ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని, ప్రతి ఇంట్లో ఇంకుడు గుంత నిర్మించుకొని వర్షపు నీటిని భూగర్భంలోకి ఇంకేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నీటి సంరక్షణను సామాజిక బాధ్యతగా భావించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ వైట్ల మధుసూదన్, కౌన్సిలర్ అంతారం సుధీర్ గౌడ్, మున్సిపల్ సిబ్బంది, విద్యాలయ యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



18వ రోజుకు చేరిన ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమ్మె

మెదక్, నవంబర్ 2 (సందేశం టైమ్స్ ప్రతినిధి): సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె 18వ రోజుకు చేరింది. జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఆధ్వర్యంలో మెదక్ జిల్లా కేంద్రంలో ఉద్యోగులు భారీ ర్యాలీ నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఒకే విధమైన విధులు నిర్వహిస్తున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా వేతనాలు చెల్లించాలని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. సమ్మె కారణంగా ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవలకు అంతరాయం ఏర్పడటంతో రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఉద్యోగ సంఘాల నాయకులతో చర్చలు జరిపి తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు కోరారు.

రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలి: మెదక్ ఎస్పీ





రామాయంపేట, నవంబర్ 2 (సందేశం టైమ్స్ ప్రతినిధి): రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడాలని మెదక్ ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా రామాయంపేటలో నిర్వహించిన రక్తదాన, ఉచిత వైద్య శిబిరాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మెదక్ జిల్లాలో విధి నిర్వహణలో 14 మంది పోలీసులు అమరులయ్యారని, వారి కుటుంబాలకు పోలీసు శాఖ అండగా ఉంటుందని తెలిపారు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన బ్యాడ్మింటన్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు అందజేశారు. షీ టీమ్స్, సైబర్ భద్రతపై కానిస్టేబుల్ ప్రసాద్ రచించిన పాటలను ఆవిష్కరించి అభినందించారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది, లయన్స్ క్లబ్, తలసేమియా సొసైటీ ప్రతినిధులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మోడిఫైడ్ సైలెన్సర్లతో వాహనాలు నడిపితే కేసులు: ఎస్సై హెచ్చరిక



నర్సాపూర్ నవంబర్ 2 (సందేశం టైమ్స్ ప్రతినిధి): మోడిఫైడ్ సైలెన్సర్లతో భారీ శబ్దాలు చేస్తూ, అతివేగంగా వాహనాలు నడిపి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నర్సాపూర్ ఎస్సై రంజిత్ రెడ్డి హెచ్చరించారు. పట్టణానికి చెందిన సిద్ధేశ్వర్ స్వామి అనే వ్యక్తి రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌కు నిబంధనలకు విరుద్ధంగా మోడిఫైడ్ సైలెన్సర్ అమర్చుకుని అధిక శబ్దంతో వాహనం నడుపుతుండగా పోలీసులు గుర్తించి కేసు నమోదు చేశారు. అనంతరం కౌన్సెలింగ్ నిర్వహించి మోడిఫైడ్ సైలెన్సర్ తొలగించి అసలు సైలెన్సర్ అమర్చించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ యువత అనధికారికంగా సైలెన్సర్లు మార్చడం, అతివేగంగా, నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం మానుకోవాలని సూచించారు. ఇలాంటి చర్యల వల్ల వృద్ధులు, చిన్నపిల్లలు, రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని తెలిపారు. ఇకపై మోడిఫైడ్ సైలెన్సర్లతో పట్టుబడితే కేసులు నమోదు చేసి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.



మెదక్ జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలి

మెదక్, నవంబర్ 2 (సందేశం టైమ్స్ ప్రతినిధి): మెదక్ జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి, కరువు నివారణకు రూ.10 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ విడుదల చేయాలని సీపీఎం జిల్లా కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు సీపీఎం జిల్లా కార్యదర్శి కె. నర్సమ్మ, కార్యదర్శివర్గ సభ్యుడు ఏ. మల్లేశం ఆధ్వర్యంలో జిల్లా ఏఓ యూనిట్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెదక్ జిల్లా ప్రధానంగా వ్యవసాయంపై ఆధారపడి ఉందని, సాగునీటి వనరులు తక్కువగా ఉండటంతో రైతులు వర్షాధార పంటలపైనే ఆధారపడుతున్నారని తెలిపారు. సకాలంలో వర్షాలు కురవకపోవడంతో జిల్లాలోని 21 మండలాల్లో పంటలు ఎండిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం మనోహరాబాద్ మండలాన్ని మాత్రమే కరువు మండలంగా ప్రకటించడం అన్యాయమని పేర్కొన్నారు. రైతులు పెట్టిన పెట్టుబడులు కూడా తిరిగి వచ్చే పరిస్థితి లేదని, ప్రతి ఎకరాకు రూ.50 వేల చొప్పున ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు లేక ప్రజలు నంగారెడ్డి, మేడ్చల్, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు కూలీ పనుల కోసం వలస వెళ్తున్నారని తెలిపారు. ప్రభుత్వం కరువు పరిస్థితులపై శాస్త్రీయంగా పునఃపరిశీలన చేసి జిల్లాలోని మొత్తం 21 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని, వ్యవసాయ శాఖ అధికారులు ప్రత్యేక అధ్యయనం చేపట్టాలని కోరారు. జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు.





నవంబర్ 30న తుది ఓటర్ల జాబితా విడుదల: ఆర్డీఓ

మెదక్, నవంబర్ 2 (సందేశం టైమ్స్ ప్రతినిధి): మెదక్ ఆర్డీఓ కార్యాలయంలో 34-మెదక్ అసెంబ్లీ నియోజకవర్గ ఆర్డీఓ, ఎన్నికల నమోదు అధికారి డాక్టర్ కె. రామాదేవి ఆధ్వర్యంలో శుక్రవారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) కార్యక్రమం పొడిగింపు, సవరించిన షెడ్యూల్‌పై వివరించారు. నోటీసుల జారీ, విచారణ, పరిష్కార ప్రక్రియ గడువును నవంబర్ 26 వరకు పొడిగించామని, తుది ఓటర్ల జాబితాను నవంబర్ 30న విడుదల చేయనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం 387 నోటీసులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని త్వరలో పరిష్కరిస్తామని వెల్లడించారు. ఫారం-6, 6A, 7, 8 దరఖాస్తుల పరిష్కార పురోగతిని వివరించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా, ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా పూర్తి చేసేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని ఆర్డీఓ కోరారు. ఈ సమావేశంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇంటర్ జోనల్ టీ20లో మెదక్ పోలీసుల సత్తా

మెదక్, నవంబర్ 2 (సందేశం టైమ్స్ ప్రతినిధి): కరీంనగర్‌లో నిర్వహించిన ఇంటర్ జోనల్ టీ20 క్రికెట్ టోర్నమెంట్‌లో మెదక్ జిల్లా పోలీస్ జట్టు విజేతగా నిలిచింది. ఫైనల్ మ్యాచ్‌లో సిరిసిల్ల పోలీస్ జట్టుపై 56 పరుగుల తేడాతో ఘన విజయం సాధించి ట్రోఫీని కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో విజేత జట్టును ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ అభినందించి సన్మానించారు. ఈ టోర్నమెంట్‌లో మెదక్, సిద్దిపేట, కరీంనగర్, సిరిసిల్ల, కామారెడ్డి జిల్లాల పోలీస్ జట్లు పాల్గొనగా, తూప్రాన్ సీఐ వెంకట రాజా గౌడ్ కెప్టెన్సీలో బరిలోకి దిగిన మెదక్ జట్టు సమష్టి కృషి, అద్భుత ఆటతీరుతో విజయాన్ని సాధించింది. మూడు మ్యాచ్‌లలో కలిపి 295 పరుగులు సాధించిన సాయి లాటికి మ్యాన్ ఆఫ్ ది సిరీస్ అవార్డు లభించింది. జట్టు కెప్టెన్ తూప్రాన్ సీఐ వెంకట రాజా గౌడ్‌తో పాటు ప్రతిభ కనబరిచిన సాయి లాటిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ క్రీడలు పోలీసుల్లో శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, ఐక్యత, సమష్టి కృషి వంటి లక్షణాలను పెంపొందిస్తాయని తెలిపారు. భవిష్యత్తులోనూ ఇదే ఉత్సాహంతో మరిన్ని విజయాలు సాధించి మెదక్ జిల్లా పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, ఐపీఎస్, సీఐలు మహేష్, వెంకట రాజా గౌడ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అల్లాదుర్గంలో వ్యక్తి మృతదేహం లభ్యం



అల్లాదుర్గం, నవంబర్ 2 (సందేశం టైమ్స్ ప్రతినిధి): మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం కావడంతో స్థానికంగా కలకలం రేగింది. మృతుడు సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ ప్రాంతానికి చెందిన వ్యక్తిగా గుర్తించినట్లు సమాచారం. మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వ్యక్తి మృతికి గల కారణాలు తెలియాల్సి ఉండగా, పోలీసుల విచారణలో పూర్తి వివరాలు వెల్లడికానున్నాయి.

చింతకాని అధికారులను మర్యాదపూర్వకంగా కలిసిన నూతన ప్రెస్ క్లబ్ కమిటీ







చింతకాని, నవంబర్ 2 (సందేశం టైమ్స్ ప్రతినిధి): చింతకాని మండల నూతన ప్రెస్ క్లబ్ కమిటీ సభ్యులు శుక్రవారం మండలంలోని వివిధ శాఖల అధికారులను మర్యాదపూర్వకంగా కలిసి పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ప్రెస్ క్లబ్ అధ్యక్షురాలు జొన్నలగడ్డ మల్లేశ్వరి, కార్యదర్శి పిచ్చయ్యతో పాటు కమిటీ సభ్యులు అధికారులను కలిసి నూతన కమిటీ వివరాలను తెలియజేశారు. ఈ సందర్భంగా మండలంలోని ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో పాత్రికేయుల బాధ్యతపై చర్చించారు. ప్రజలకు, అధికారులకు మధ్య వారధిగా ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని నూతన ప్రెస్ క్లబ్ కమిటీ సభ్యులు తెలిపారు.

బోరంచ నల్లపోచమ్మ అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖ వ్యాపారవేత్తలు





మనూర్ , నవంబర్ 2 (సందేశం టైమ్స్ ప్రతినిధి): సంగారెడ్డి జిల్లా మనూరు మండలం బోరంచ గ్రామంలోని శ్రీశ్రీశ్రీ నల్లపోచమ్మ తల్లి దేవస్థానాన్ని హైదరాబాద్ చందానగర్‌కు చెందిన ప్రముఖ బంగారు ఆభరణాల వ్యాపార సంస్థ నత్తు అండ్ సన్స్ జువెల్లరీ నిర్వాహకులు రాజు రిజ్వానీ, రాజేష్ రిజ్వానీ, సూరజ్ రిజ్వానీ శుక్రవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ ఏడాది జాతర ఉత్సవాల నిర్వహణకు ఆలయానికి 12 బారీ గేట్లు, రెండు పెద్ద లైటింగ్ బ్యానర్లను విరాళంగా అందజేశారు. వారి సేవాభావాన్ని అభినందించిన ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీర్వచనాలు అందజేశారు. ఈ సందర్భంగా భక్తులు, ఆలయ నిర్వాహకులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.



ప్రతి జిల్లాలో 5 వేల వికలాంగుల బ్యాక్‌లాగ్ ఉద్యోగాలు భర్తీ చేయాలి: గిద్ది రాజేష్

సూర్యాపేట, నవంబర్ 2 (సందేశం టైమ్స్ జిల్లా కోఆర్డినేటర్ సోమయ్య కంభంపాటి): రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో కనీసం 5 వేల వికలాంగుల బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను గుర్తించి తక్షణమే భర్తీ చేయాలని భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గిద్ది రాజేష్ డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ వికలాంగులకు ఇచ్చిన హామీలన్నింటినీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కోరారు. శుక్రవారం తెలంగాణ మహిళా సాధికారిక సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర వికలాంగుల డైరెక్టరేట్ ముట్టడి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే వికలాంగుల పింఛన్‌ను నెలకు రూ.6 వేలకు పెంచుతామని, రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని, ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను భర్తీ చేస్తామని, వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం-2016ను సమర్థవంతంగా అమలు చేస్తామని, స్థానిక సంస్థల ఎన్నికల్లో రాజకీయ రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు మూడేళ్లు కావస్తున్నా హామీలు అమలుకు నోచుకోలేదని ఆయన విమర్శించారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిన ప్రభుత్వం వికలాంగులకు ఎందుకు కల్పించడం లేదని ప్రశ్నించారు. వికలాంగులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో పాటు అన్ని ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను గుర్తించి ప్రత్యేక నోటిఫికేషన్ల ద్వారా బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను భర్తీ చేయాలని, అర్హులైన వికలాంగ నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. వికలాంగుల కోసం ప్రత్యేక సంక్షేమ శాఖ ఏర్పాటు చేయాలని, వికలాంగుడైన వ్యక్తినే రాష్ట్ర వికలాంగుల కమిషనర్‌గా నియమించాలని, చట్టబద్ధమైన రిజర్వేషన్లను పకడ్బందీగా అమలు చేయాలని, స్థానిక సంస్థల్లో వికలాంగులకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే నెరవేర్చకపోతే కొడంగల్ నుంచి రాష్ట్రవ్యాప్తంగా వికలాంగులను సమీకరించి ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని, రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై రాష్ట్రవ్యాప్త పోరాటం చేపడతామని గిద్ది రాజేష్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వివిధ దివ్యాంగ సంఘాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఢిల్లీలో కాంగ్రెస్ ‘ఓట్ బచావో – దేశ్ బచావో’ మహా ర్యాలీ.. ఎన్నికల సంఘం తీరుపై విపక్షాల నిరసన



న్యూఢిల్లీ, నవంబర్ 2 – సందేశం టైమ్స్ ప్రత్యేక కథనం: దేశ రాజధాని ఢిల్లీలో నవంబర్ 1న కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇండియా కూటమి నిర్వహించిన ‘ఓట్ బచావో – దేశ్ బచావో మహా ర్యాలీ’ రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో జరిగిన ఈ నిరసన కార్యక్రమంలో లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ వాద్రా, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ తదితర ఇండియా కూటమి నాయకులు పాల్గొన్నారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో అక్రమాలు జరుగుతున్నాయంటూ ప్రతిపక్ష పార్టీలు ఆరోపించాయి. ఈ ప్రక్రియ ద్వారా పెద్ద సంఖ్యలో ఓటర్ల పేర్లు తొలగించారని, ఎన్నికల వ్యవస్థ పారదర్శకతపై అనుమానాలు తలెత్తుతున్నాయని నాయకులు విమర్శించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని ర్యాలీలో డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీ తన ప్రసంగంలో ఎన్నికల ప్రక్రియపై తీవ్ర విమర్శలు చేస్తూ, ఓటు హక్కు పరిరక్షణ ప్రజాస్వామ్య పరిరక్షణతో ముడిపడి ఉందని పేర్కొన్నారు. ఈ నిరసనకు ముందు అక్టోబర్ 31న కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే నివాసంలో ఇండియా కూటమికి చెందిన 21 రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రధాన ఎన్నికల కమిషనర్‌పై ప్రతీకాత్మక ‘పబ్లిక్ ఇంపీచ్‌మెంట్’ కార్యక్రమాన్ని నిర్వహించి, ఆరు అంశాలతో కూడిన తీర్మానాన్ని ఆమోదించినట్లు వార్తా కథనాలు వెల్లడించాయి. మరోవైపు, ఎన్నికల సంఘం తన విధులు నిబంధనల ప్రకారమే నిర్వహిస్తోందని, ఓటర్ల పేర్లు తొలగింపుపై అభ్యంతరాలుంటే తిరిగి నమోదు చేసుకునే అవకాశం ఉందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. బీజేపీ నేతలు కూడా కాంగ్రెస్ ఆరోపణలను ఖండించారు. ర్యాలీ నేపథ్యంలో ఢిల్లీలోని రామ్‌లీలా మైదానం పరిసర ప్రాంతాల్లో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయగా, ట్రాఫిక్ ఆంక్షలు కూడా అమలు చేశారు. మొత్తంగా ఓటర్ల జాబితాల సవరణ, ఎన్నికల సంఘం స్వతంత్రత, ఓటు హక్కు పరిరక్షణ అంశాలు ఈ ర్యాలీ ద్వారా మరోసారి జాతీయ రాజకీయ చర్చలోకి వచ్చాయి.

రామారావు హత్య కేసులో నిందితులను పోలీసులు అరెస్టు చేశారు.. భట్టి విక్రమార్కపై ఆరోపణలు సరికాదు: మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి



చింతకాని, నవంబర్ 2 (సందేశం టైమ్స్ ప్రతినిధి): శవ రాజకీయాలు, చిల్లర రాజకీయాలు చేయడం తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నైజం కాదని మత్కేపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పాతర్లపాడు గ్రామంలో మాజీ ఎంపీటీసీ బొర్ర ప్రసాదరావు అధ్యక్షతన నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గత ఏడాది పాతర్లపాడు గ్రామంలో సీపీఎం రైతు సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సామినేని రామారావు హత్యకు గురైన ఘటనలో నిందితులను పట్టుకోవాలని సీపీఎం రాష్ట్ర నాయకులతో పాటు కాంగ్రెస్ జిల్లా నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారని, పలు ఆందోళనలు, ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించారని తెలిపారు. ఈ నేపథ్యంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పోలీసు ఉన్నతాధికారులతో కేసును సమగ్రంగా దర్యాప్తు చేయించాలని ఆదేశించారని, పోలీసులు వివిధ కోణాల్లో విచారణ జరిపి, ఫోరెన్సిక్ సైన్స్ అండ్ టెక్నాలజీ ల్యాబొరేటరీ సహకారంతో నిందితులను గుర్తించి అరెస్టు చేశారని పేర్కొన్నారు. విచారణలో నిందితులకు సీపీఎం నాయకులతో సంబంధాలు ఉన్నట్లు తేలిన నేపథ్యంలో, కేసును పక్కదారి పట్టించేలా భట్టి విక్రమార్కే హత్య చేయించారని, అమాయకులను పోలీసులు అరెస్టు చేశారని ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. పోలీసుల దర్యాప్తులో అరెస్టయిన నిందితులు తెల్దారుపల్లికి చెందిన తమ్మినేని వీరభద్రం అనుచరులని, వారికి గతంలో పలు కేసుల్లో నేరచరిత్ర ఉందని అంబటి ఆరోపించారు. సొంత పార్టీకి చెందిన నాయకుడైన రామారావు హత్య ఘటనపై రాజకీయాలు చేయకుండా, చట్టం తన పని తాను చేసుకునేలా సహకరించాలని సూచించారు. నిజాయితీ, నిస్వార్థంగా పనిచేసిన రామారావు వంటి నాయకుడి హత్యకు సంబంధించిన నిందను గ్రామంలోని అమాయకులపై వేయడం ఆయన ఆత్మను క్షోభకు గురిచేస్తుందని అన్నారు. గ్రామాల్లో కక్షలు, కార్పణ్యాలకు తావులేకుండా అభివృద్ధికి సహకరించాలని, భట్టి విక్రమార్కపై నిరాధార ఆరోపణలు చేయడం మానుకోవాలని కోరారు. చట్టం ఎవరినీ వదిలిపెట్టదని, నేరం చేసిన వారు ఎంతటివారైనా శిక్షకు గురవుతారని తెలిపారు. ఈ సమావేశంలో మాజీ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు మడిపల్లి భాస్కర్, కొప్పుల గోవిందరావు, కూరపాటి కిషోర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బందెల నాగార్జున, పెంట్యాల అప్పారావు, సర్పంచులు కిలారి మనోహర్, ఆవుల నాగేశ్వరరావు, గ్రామ శాఖ అధ్యక్షుడు బొర్ర శేషగిరిరావు, మండల నాయకుడు కాండ్ర పిచ్చయ్య, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కంచుమర్తి రామకృష్ణ, తాళ్లూరి బాలాజీ, కొత్తపల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కొడిపల్లిలో పట్టపగలే చోరీకి యత్నం.. దొంగను పట్టుకున్న స్థానికులు

కొడిపల్లి, నవంబర్ 2 (సందేశం టైమ్స్ ప్రతినిధి): మెదక్ జిల్లా కొడిపల్లి మండల కేంద్రంలోని మల్లికార్జున కాలనీలో పట్టపగలే ఓ ఇంట్లో చోరీకి యత్నించిన వ్యక్తిని స్థానికులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కాలనీకి చెందిన బుర్జీగాడి బుమయ్య కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి వ్యవసాయ పనుల నిమిత్తం పొలానికి వెళ్లిన సమయంలో, ఇంట్లో ఎవరూ లేరని గమనించిన ఓ వ్యక్తి ఇంటి తాళం పగలగొట్టి లోపలికి ప్రవేశించాడు. అనంతరం బీరువా తాళం కూడా పగలగొట్టి అందులోని వస్తువులు, నగదు, ఆభరణాలు అపహరించేందుకు ప్రయత్నిస్తుండగా, అదే సమయంలో ఇంటికి చేరుకున్న బుమయ్య కుమారుడు గోపాల్‌కు అనుమానాస్పద శబ్దాలు వినిపించాయి. లోపలికి వెళ్లి చూడగా బీరువా పగలగొడుతున్న వ్యక్తిని గుర్తించి వెంటనే చుట్టుపక్కల వారిని అప్రమత్తం చేయడంతో స్థానికులు అక్కడికి చేరుకుని అతడిని పట్టుకున్నారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించగా వారు ఘటనాస్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. పట్టుబడిన వ్యక్తి గతంలో ఇతర ప్రాంతాల్లోనూ చోరీలకు పాల్పడి ఉండవచ్చని, అతని వద్ద కొన్ని ఆభరణాలు ఉన్నట్లు స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. నిందితుడి గుర్తింపు, ఆభరణాల వివరాలు, ఇతర చోరీలతో సంబంధం వంటి అంశాలు పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది. ఈ ఘటనతో కొడిపల్లి మండల కేంద్రంలో ప్రజల్లో ఆందోళన నెలకొంది. ఇళ్లకు తాళాలు వేసి బయటకు వెళ్లే సమయంలో అప్రమత్తంగా ఉండాలని స్థానికులు సూచిస్తున్నారు.



మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం: చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది

సూర్యాపేట, నవంబర్ 02 (సందేశం టైమ్స్ జిల్లా కోఆర్డినేటర్ సోమయ్య కంభంపాటి): ప్రజా ప్రభుత్వంలో సూర్యాపేట పట్టణంలోని అన్ని వార్డుల్లో సంక్షేమ, అభివృద్ధి పథకాలను సమానంగా అమలు చేస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది అన్నారు. శుక్రవారం పట్టణంలోని నాలుగో వార్డు నేత్యా తండాలో మున్సిపల్ జనరల్ ఫండ్ నుంచి రూ.5 లక్షల నిధులతో నిర్మించనున్న సీసీ డ్రైన్ పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నాలుగో వార్డుకు 21 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని, వాటి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. వార్డులో బోర్‌వెల్‌తో పాటు పైపులైన్ నిర్మాణ పనులకు త్వరలోనే శంకుస్థాపన చేస్తామని చెప్పారు. అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్లు అనే తేడా లేకుండా అన్ని వార్డుల్లో సమానంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని, సూర్యాపేట మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ బుక్యా జ్యోతి లింగ నాయక్, ఏఈ తిరుమలయ్య, మున్సిపల్ సిబ్బంది, వార్డు ప్రముఖులు వాజిద్ మియా, సలీం ఆఫ్ ఖాన్, శ్రీనివాసరెడ్డి, బాలు నాయక్ తదితరులు పాల్గొన్నారు.



చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న ఇద్దరు నిందితుల అరెస్ట్.. రూ.4 లక్షల విలువైన బంగారం గుర్తింపు: ఎస్పీ కె. నరసింహ

సూర్యాపేట, నవంబర్ 2 (సందేశం టైమ్స్ ప్రతినిధి): కిరాణా దుకాణాల్లో మహిళలు ఒంటరిగా ఉన్న సమయాన్ని ఆసరాగా చేసుకుని చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను సూర్యాపేట పట్టణ పోలీసులు అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్పీ కె. నరసింహ ఐపీఎస్ తెలిపారు. గురువారం సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన కేసుల వివరాలను వెల్లడిస్తూ, నిందితుల వద్ద నుంచి సుమారు రూ.4 లక్షల విలువైన బంగారాన్ని గుర్తించామని, దానిని ఖమ్మం పట్టణంలోని ముత్తూట్ ఫైనాన్స్‌లో కుదువ పెట్టినట్లు విచారణలో వెల్లడైందని తెలిపారు. నిందితులను ఖమ్మం జిల్లాకు చెందిన షేక్ ఖాసీం అలియాస్ షన్ను (23), తుమ్మాటి భరత్ కుమార్ అలియాస్ భరత్ (24)గా గుర్తించామని, వీరిలో ఖాసీం కార్ డెకరేటర్‌గా, భరత్ ప్రైవేట్ ఆసుపత్రిలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నారని వివరించారు. ఈ నెల 26వ తేదీ సాయంత్రం 6.45 గంటల సమయంలో సూర్యాపేట పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో ఓ కిరాణా దుకాణంలో మహిళ ఒంటరిగా ఉన్న సమయంలో సిగరెట్, వాటర్ బాటిల్, సెంటర్ ఫ్రెష్ కావాలని అడిగి, ఆమె వాటిని ఇచ్చే పనిలో ఉండగా మెడలోని బంగారు పుస్తెలతాడును లాక్కొని మోటార్ సైకిల్‌పై పరారయ్యారని తెలిపారు. ఇదే తరహాలో ఈ నెల 11వ తేదీన కోదాడ పట్టణంలోని ఓ కిరాణా దుకాణంలో మహిళ మెడలో ఉన్న సుమారు రెండు తులాల బంగారు పుస్తెలతాడును అపహరించినట్లు విచారణలో వెల్లడైందన్నారు. ఈ ఘటనలపై సూర్యాపేట రెండో పట్టణ, కోదాడ పట్టణ పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయని పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల్లోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించి నిందితులను గుర్తించిన పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారని, అక్టోబర్ 29న ఖమ్మం క్రాస్ రోడ్డు వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో అనుమానాస్పదంగా కనిపించిన ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించగా రెండు చైన్ స్నాచింగ్‌లకు పాల్పడినట్లు అంగీకరించారని తెలిపారు. నిందితులపై గతంలో గంజాయి, దొంగతనం కేసులు ఉన్నట్లు వెల్లడైందని చెప్పారు. ఇలాంటి నేరాలకు పాల్పడే వారిపై ప్రత్యేక కార్యాచరణ చేపడుతున్నామని, పదేపదే నేరాలకు పాల్పడుతూ ప్రజలను ఇబ్బందులకు గురిచేసే వారిపై జిల్లా బహిష్కరణ, రౌడీషీట్లు, నస్పెక్ట్ షీట్లు, పీడీ యాక్ట్ వంటి చర్యలు తీసుకునే అంశాన్ని పరిశీలిస్తున్నామని ఎస్పీ హెచ్చరించారు. ముఖ్యంగా దుకాణాలు నిర్వహించే మహిళలు అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిల్లాలో సీసీటీవీ కెమెరాల ఏర్పాటు విస్తృతంగా చేపట్టామని, నేరాల ఛేదనలో ఆధునిక సాంకేతికతను వినియోగిస్తున్నామని, ప్రజలు కూడా తమ పరిసరాల్లో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ఈ రెండు కేసులను ఛేదించడంలో కృషి చేసిన పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, ఎస్ఐ కె. గోపికృష్ణ, రామనరసయ్య, శ్రీరాములు, కొండ రమేష్, నవీన్‌లను ఎస్పీ అభినందించారు. సమావేశంలో డీఎస్పీ ప్రసన్న కుమార్, సీఐ వెంకటయ్య, ఎస్ఐలు సందీప్, కనకరత్నం, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



పట్టభద్రుల ఓటరు నమోదుకు నవంబర్ 6 చివరి తేదీ: కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సూర్యాపేట, నవంబర్ 02 – సందేశం టైమ్స్ జిల్లా కోఆర్డినేటర్ సోమయ్య కంభంపాటి: శాసనమండలి పట్టభద్రుల నియోజకవర్గ ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునేందుకు నవంబర్ 6 చివరి తేదీ అని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. అర్హులైన పట్టభద్రులు నిర్ణీత గడువులోగా ఫారం-18 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 2026 నవంబర్ 1వ తేదీని అర్హత తేదీగా పరిగణిస్తామని, 2023 అక్టోబర్ 31 నాటికి గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ పూర్తి చేసిన వారు పట్టభద్రుల ఓటరుగా నమోదు చేసుకోవడానికి అర్హులని వివరించారు. తెలంగాణ ముఖ్య ఎన్నికల అధికారి అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని, ప్రత్యక్షంగా దరఖాస్తు చేసుకునేవారు ఫారం-18తో పాటు విద్యార్హత ధ్రువపత్రాలను సంబంధిత సహాయ ఎన్నికల నమోదు అధికారి లేదా నియమిత అధికారి కార్యాలయాల్లో సమర్పించవచ్చని తెలిపారు. పోస్టు ద్వారా కూడా దరఖాస్తులు పంపేందుకు అవకాశం ఉందన్నారు. ఆన్‌లైన్‌లో అయినా, ప్రత్యక్షంగా అయినా దరఖాస్తు చేసుకునే పట్టభద్రులలెవరూ ఓటరు నమోదుకు దూరం కాకుండా రాజకీయ పార్టీలు, పట్టభద్రుల సంఘాలు, విద్యాసంస్థలు, ఉద్యోగ సంఘాలు, ప్రజాప్రతినిధులు విస్తృతంగా అవగాహన కల్పించాలని కోరారు. అందిన దరఖాస్తులను అధికారులు నిబంధనల ప్రకారం పరిశీలించి అర్హమైన వాటిని పరిష్కరిస్తారని పేర్కొన్నారు. దరఖాస్తులకు సంబంధించి సందేహాలు, అభ్యంతరాలు లేదా ఫిర్యాదులు ఉంటే సంబంధిత ఎన్నికల నమోదు అధికారి లేదా సహాయ ఎన్నికల నమోదు అధికారి కార్యాలయాలను సంప్రదించాలని సూచించారు. అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకుని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వామి కావాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

ఢిల్లీ నిరసన కార్యక్రమానికి వెళుతున్న అందోల్ నియోజకవర్గ మండలాధ్యక్షులకు ఉద్యమాభివందనాలు: కచూర్ రావు



వట్పల్లి మండల్ నవంబర్ 2 సందేశం టైమ్స్ ప్రతినిధి సంగారెడ్డి జిల్లా అందోల్ నియోజకవర్గ మండలాధ్యక్షులకు నమస్కారములు తెలియజేస్తూ, దేశ రాజధాని ఢిల్లీలో నిర్వహించనున్న భారీ నిరసన కార్యక్రమానికి ప్రజల మేలు కోరే ఉద్యమ స్ఫూర్తితో, యువతర ఆలోచనలతో ముందుకు సాగుతున్న గౌరవనీయ మండలాధ్యక్షులకు ఉద్యమాభివందనాలు తెలియజేస్తున్నానని రాయికోడ్ ఆత్మ కమిటీ చైర్మన్ కచూర్ రావు అన్నారు. అన్యాయాలను నిలదీసి ప్రశ్నించే గుణం, హక్కుల సాధన కోసం జరిగే పోరాటాల్లో ముందువరుసలో నిలిచే మీరంతా ఢిల్లీలో చేపట్టిన కార్యక్రమంలో విజయం సాధించి తిరిగి రావాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నానని ఆయన పేర్కొన్నారు.



నేటి రాశి ఫలాలు – నవంబర్ 2, 2026

మేషం ♈ : స్నేహితుల నుంచి సహాయ సహకారాలు లభిస్తాయి. మనసులో సంతోషం నెలకొంటుంది. చేపట్టిన పనులను ఉత్సాహంగా పూర్తి చేస్తారు. కొత్త ప్రయత్నాలకు అనుకూల సమయం.

వృషభం ♉ : కుటుంబ సభ్యులు, జీవిత భాగస్వామితో ఆనందంగా గడుపుతారు. ఇంట్లో ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటుంది. బంధుమిత్రులతో సంతోషంగా సమయం గడుపుతారు.

మిథునం ♊ : క్రీడలు, బహిరంగ కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొంటారు. కొత్త పరిచయాలు ఏర్పడే అవకాశాలు ఉన్నాయి. మీ ప్రతిభకు గుర్తింపు లభిస్తుంది.

కర్కాటకం ♋ : మిశ్రమ ఫలితాలు ఉంటాయి. కొత్త పనులు ప్రారంభించే ముందు ఒకటికి రెండుసార్లు ఆలోచించాలి. ముఖ్యమైన నిర్ణయాల్లో తొందరపాటు వద్దు.

సింహం ♌ : కొన్ని సవాళ్లు ఎదురైనా ధైర్యంగా ముందుకు సాగుతారు. ఆత్మవిశ్వాసంతో సమస్యలను అధిగమిస్తారు. పట్టుదలతో అనుకున్న లక్ష్యాలను చేరుకునేందుకు ప్రయత్నిస్తారు.

కన్య ♍ : ఆరోగ్య విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. అనవసర వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. పనుల్లో ఓర్పు, సంయమనం అవసరం.

తుల ♎ : ఆర్థికంగా, వ్యక్తిగతంగా అనుకూల పరిస్థితులు ఉంటాయి. చేపట్టిన పనుల్లో సంతృప్తి లభిస్తుంది. కుటుంబ సభ్యుల నుంచి సహకారం అందుతుంది.

వృశ్చికం ♏ : పనుల విషయంలో కొంత ఒత్తిడి ఎదురుకావచ్చు. తొందరపాటు నిర్ణయాలకు దూరంగా ఉండాలి. ఓర్పుతో వ్యవహరిస్తే సమస్యలను అధిగమించగలరు.

ధనుస్సు ♐ : రోజంతా అనుకూల వాతావరణం ఉంటుంది. చేపట్టిన పనులు విజయవంతంగా పూర్తవుతాయి. ముఖ్యమైన విషయాల్లో సానుకూల ఫలితాలు పొందుతారు.

మకరం ♑ : ఖర్చుల విషయంలో అప్రమత్తంగా ఉండాలి. ఆర్థిక వ్యవహారాల్లో ఆచితూచి నిర్ణయాలు తీసుకోవాలి. అనవసర ఖర్చులను తగ్గించుకోవడం మంచిది.

కుంభం ♒ : కుటుంబంలో సఖ్యత, సంతోషం పెరుగుతాయి. ఆర్థికంగా లాభాలు పొందే అవకాశాలు ఉన్నాయి. సన్నిహితుల సహకారంతో పనులు ముందుకు సాగుతాయి.

మీనం ♓ : ముఖ్యమైన విషయాల్లో వ్యూహాత్మకంగా వ్యవహరించాలి. ఖర్చులపై నియంత్రణ పాటించాలి. ఆలోచించి నిర్ణయాలు తీసుకుంటే మంచి ఫలితాలు పొందగలరు.

మాక్ పార్లమెంట్‌లో మెదక్ విద్యార్థినికి రాష్ట్రస్థాయి ప్రథమ స్థానం



మెదక్, నవంబర్ 2 (సందేశం టైమ్స్ ప్రతినిధి): రాష్ట్రస్థాయిలో నిర్వహించిన మాక్ పార్లమెంట్ పోటీల్లో మెదక్ జిల్లా శంకరంపేట మోడల్ స్కూల్‌కు చెందిన పదో తరగతి విద్యార్థిని బి. ఆర్తి చంద్ర ప్రథమ స్థానంలో నిలిచి జిల్లాకు గర్వకారణంగా నిలిచారు. రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి మొత్తం 66 మంది విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీల్లో టీజీఎంఎస్ శంకరంపేట-ఆర్ పాఠశాల తరఫున పాల్గొన్న ఆర్తి చంద్ర డిప్యూటీ స్పీకర్‌గా వ్యవహరిస్తూ తన ప్రతిభను చాటుకున్నారు. ఉత్తమ పార్లమెంటేరియన్‌గా ఎంపికై రాష్ట్రస్థాయి ప్రథమ బహుమతిని అందుకున్నారు. రాష్ట్రస్థాయి అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర సమగ్ర శిక్ష జాయింట్ డైరెక్టర్ మదన్ మోహన్ చేతుల మీదుగా ఆర్తి చంద్ర అవార్డును స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి రాజు విద్యార్థిని ఆర్తి చంద్రను ప్రత్యేకంగా అభినందించారు. ఆమెకు మార్గదర్శకత్వం వహించిన గైడ్ టీచర్ లింగమయ్య (పీజీటీ), పాఠశాల ప్రిన్సిపాల్‌తో పాటు సహకరించిన సోషల్ ఫోరం బాధ్యులు నర్సింలు, రవిబాబులను ప్రశంసించారు. ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం, విద్యార్థిని కృషి, పట్టుదలతో రాష్ట్రస్థాయిలో ఈ ఘనత సాధించడం అభినందనీయమని పేర్కొన్నారు.



సర్దార్ వల్లభాయ్ పటేల్ సేవలు దేశ ప్రజలకు మరువలేనివి: బీజేపీ జిల్లా అధ్యక్షుడు వల్దాస్ మల్లేష్ గౌడ్

నర్సాపూర్, నవంబర్ 2 (సందేశం టైమ్స్ మెదక్ జిల్లా ప్రతినిధి): సర్దార్ వల్లభాయ్ పటేల్ దేశానికి చేసిన సేవలు, దేశ సమైక్యత కోసం ఆయన అందించిన కృషి భారత ప్రజలకు ఎప్పటికీ మరువలేనివని బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షుడు వల్దాస్ మల్లేష్ గౌడ్ అన్నారు. నర్సాపూర్ పట్టణంలోని బీజేపీ అసెంబ్లీ పార్టీ కార్యాలయంలో పట్టణ కన్వీనర్ ప్రేమ్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ 151వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నాయకులు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వల్దాస్ మల్లేష్ గౌడ్ మాట్లాడుతూ, స్వాతంత్ర్యం అనంతరం దేశంలోని అనేక సంస్థానాలను ఏకం చేసి భారతదేశానికి సమైక్య రూపాన్ని తీసుకురావడంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. ఆయన దూరదృష్టి, నాయకత్వ లక్షణాలు, దేశ సమగ్రత కోసం చేసిన కృషి నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. పటేల్ ఆశయాలను ఆదర్శంగా తీసుకొని దేశ అభ్యున్నతి, ఐక్యత, సమగ్రత కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులు రమేష్ గౌడ్, దిశా కమిటీ సభ్యులు పెద్ద రమేష్ గౌడ్, బోడ పద్మ, రామచంద్రాపూర్ ఉపసర్పంచ్ వినోద్, శివ, బీజేపీ నాయకులు శ్రీనివాస్, గోడేల రాణి, బీజేవైఎం నాయకులు బిక్షపతి, చిగురు రాజు తదితరులు పాల్గొన్నారు.



జిల్లా పోలీస్ క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతగా యంగ్ స్టార్ జట్టు



నర్సాపూర్, నవంబర్ 2 (సందేశం టైమ్స్ మెదక్ జిల్లా ప్రతినిధి): మెదక్ జిల్లా నర్సాపూర్ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా పోలీస్ క్రికెట్ టోర్నమెంట్‌లో యంగ్ స్టార్ జట్టు విజేతగా నిలిచింది. శనివారం నిర్వహించిన ఫైనల్ మ్యాచ్‌లో సహారా ఇండియన్స్, యంగ్ స్టార్ జట్లు తలపడగా, ఉత్కంఠభరితంగా సాగిన పోటీలో యంగ్ స్టార్ జట్టు విజయం సాధించింది. అనంతరం నిర్వహించిన బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమానికి మెదక్ జిల్లా అదనపు ఎస్పీ విక్రాంత్ సింగ్, డీఎస్పీ నరేందర్ గౌడ్, నర్సాపూర్ సీఐ రంగకృష్ణ, ఎస్ఐ రంజిత్ రెడ్డి హాజరై విజేత, రన్నరప్ జట్లకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ విక్రాంత్ సింగ్ మాట్లాడుతూ యువత మత్తు పానీయాలు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని వాటి సాధన కోసం క్రమశిక్షణతో కృషి చేయాలని సూచించారు. క్రీడలు యువతలో ఐక్యత, క్రమశిక్షణ, పట్టుదల, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. యువత క్రీడలు, విద్యతో పాటు ఇతర రంగాల్లోనూ తమ ప్రతిభను చాటుకుంటూ భావితరాలకు ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇరు జట్ల క్రీడాకారులు, నర్సాపూర్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కక్షిదారులకు సత్వరమే న్యాయం అందించాలి: హైకోర్టు న్యాయమూర్తి గాడి ప్రవీణ్ కుమార్



నర్సాపూర్, నవంబర్ 2 (సందేశం టైమ్స్ మెదక్ జిల్లా ప్రతినిధి): కక్షిదారులకు సత్వర న్యాయం అందించడంతో పాటు న్యాయవ్యవస్థపై ప్రజలకు విశ్వాసం కలిగించేలా న్యాయవాదులు తమ విధులు నిర్వర్తించాలని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి గాడి ప్రవీణ్ కుమార్ సూచించారు. మెదక్ జిల్లా నర్సాపూర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కోర్టు ప్రాంగణానికి చేరుకున్న ఆయనకు అధికారులు, న్యాయవాదులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. అనంతరం రిబ్బన్ కట్ చేసి నూతన కోర్టును ప్రారంభించారు. కోర్టు ప్రాంగణంలో మొక్క నాటి నీరు పోసిన అనంతరం సమావేశ మందిరంలో జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ న్యాయవాద వృత్తిలో ఉన్న ప్రతి ఒక్కరూ న్యాయధర్మాన్ని పాటిస్తూ, అన్యాయాన్ని సహించకుండా కక్షిదారులకు నిష్పక్షపాతంగా న్యాయం అందించేందుకు కృషి చేయాలని అన్నారు. బార్ అసోసియేషన్, బెంచ్ మధ్య అన్నదమ్ముల అనుబంధం కొనసాగాలని, పరస్పర గౌరవం, సమన్వయంతో న్యాయవ్యవస్థ అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. డ్రైవర్లు డ్రెస్ కోడ్ పాటిస్తూ క్రమశిక్షణతో వ్యవహరించాలని పేర్కొన్నారు. జీవితంలో ఎంత ఉన్నత స్థాయికి ఎదిగినా ఒదిగి ఉండాలని, అమ్మను మించిన గురువు ఎవరూ లేరని అన్నారు. కక్షిదారుల సమస్యలను సామరస్యంగా పరిష్కరిస్తూ వారికి న్యాయం అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మెదక్ జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి నీలిమ మాట్లాడుతూ నర్సాపూర్ పరిసర ప్రాంత ప్రజలకు ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు అందుబాటులోకి రావడం వల్ల న్యాయసేవలు మరింత చేరువవుతాయని, సత్వర న్యాయం పొందేందుకు అవకాశం కలుగుతుందని తెలిపారు. జిల్లాలోని కోర్టు ప్రాంగణాల్లో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేసి కక్షిదారులకు తాగునీటి సౌకర్యం కల్పించాలని, మహిళా శక్తి క్యాంటీన్ ద్వారా తక్కువ ధరకు భోజన సదుపాయం అందించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. అనంతరం హైకోర్టు న్యాయమూర్తి గాడి ప్రవీణ్ కుమార్‌ను జిల్లా న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ సభ్యులు మెమెంటో అందించి, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, అదనపు జిల్లా సెషన్స్ జడ్జి శుభవల్లి, సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రూబీనా ఫాతిమా, మొబైల్ కోర్టు న్యాయమూర్తి సాయి ప్రభాకర్, అల్లాదుర్గం జూనియర్ సివిల్ జడ్జి సుచరిత, నర్సాపూర్ జూనియర్ సివిల్ జడ్జి ఎం. హేమలత, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, బార్ అసోసియేషన్ సభ్యులు, వివిధ న్యాయవాద సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) రిజిస్ట్రేషన్ నం. : TGTEL/25/A0348 , టైటిల్ కోడ్ : Sandhesham Times.ప్రచురణ స్థలం :3- 82 వాయిల సింగారం, అనంతగిరి మండలం,సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త (Publisher): మద్దినేని నాగేశ్వర రావు, సంపాదకులు (Editor) : కాసే అమృత,మొబైల్ : 9052045435, ఈ–మెయిల్ : sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్ : www.sandeshamtimes.com,ముద్రణ (Printed at) : సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press)3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు,ఆంధ్రప్రదేశ్ – 522006.